కాలినడక వంతెనతోనే ప్రమాదాలకు చెక్

- సంగివలస వద్ద విపరీతంగా రద్దీ
- జాతీయ రహదారి దాటే క్రమంలో ప్రమాదాలు

తగరపువలస : సంగివలస ప్రాంతంలో కాలినడక వంతెన నిర్మాణంతోనే తరచూ జరిగే ప్రమాదాలను నియంత్రించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆరేళ్ల క్రితం జాతీయ రహదారుల విస్తరణ కారణంగా భీమిలి నియోజకవర్గంలోనే ముఖ్యమైన తగరపువలస తన ఉనికిని దాదాపు కోల్పోయింది. ఈ ప్రాంతం కేంద్రంగా రెండు చోట్ల అండర్‌పాస్ వంతెనలు నిర్మించడంతో తగరపువలసకు ప్రత్యామ్నాయంగా సంగివలస నిత్యం రద్దీగా మారిపోయింది. సంగివలస కూడలిలో ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన ముగ్గురు అమ్మవార్ల ఆలయాలు, ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్, దంత వైద్య కళాశాలలు, కార్పొరేట్ ఆస్పత్రుల చుట్టూ లెక్కకు మించి పుట్టుకొస్తున్న వ్యాపార సంస్థలు, అపార్ట్‌మెంట్లు కారణంగా ప్రమాదాలు కూడా నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా కూడలికి ఇరువైపులా సర్వీస్ రోడ్లపై దిగిన ప్రయాణికులు, విద్యార్థులు, రోగులు జాతీయ రహదారిని దాటడానికి అండర్‌పాత్, కాలినడక వంతెన సమీపంలో లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రెయిలింగ్ పైనుంచి గెంతుతున్నారు. అనంతరం జాతీయ రహదారిని దాటే క్రమంలో వేగంగా వచ్చే వాహనాలకు బలి అవుతున్నారు. లేదంటే 200 మీటర్ల గమ్యానికి చుట్టూ తిరిగి రావడానికి ప్రైవేట్ వాహనాలకు రూ.వందలు చెల్లించుకోవాల్సి వస్తోంది. ఇదే కూడలి కేంద్రంగా కొన్ని ప్రయాణికుల వాహనాలు ఇష్టానుసారంగా వాహనాలను జాతీయ రహదారి, సర్వీస్ రోడ్లపై నిలిపివేసి ప్రమాదాలకు కారణమవుతున్నారు. సర్వీస్ రోడ్లను కొందరు వ్యాపారులు ఆక్రమించేయడంతో కుచించుకుపోయి ప్రమాదాల తీవ్రత కూడా ఎక్కువగా ఉంటుంది. దీంతో అమ్మవారి ఆలయం నుంచి అవతలి వైపు అనిట్స్ కూడలి వరకు కాలినడక వంతెన నిర్మించాలన్న డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోది.

సిటీ బస్సుల సిబ్బంది తీరు విచిత్రం

తగరపువలస వద్దకు వచ్చేసరికి బస్సులన్నీ ఫ్లై ఓవర్ మీదుగా వెళ్లిపోవడంతో ప్రయాణికుల్లో ఎక్కువ మంది రాకపోకలు సాగించడానికి సంగివలసనే ఎంచుకుంటున్నారు. ఇరువైపులా సర్వీస్ రోడ్లపై రాకపోకలు సాగించే అన్నిరకాల సిటీ బస్సులు, ప్రైవేట్ బస్సులు కూడా సంగివలస కూడలిలో ఆపుతారు. విశాఖ నుంచి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల మీదుగా వెళ్లే బస్సులు కూడా ముగ్గురు అమ్మవార్ల ఆలయం ముందు జాతీయ రహదారిపై నిలుపుతారు. కానీ విజయనగరం, శ్రీకాకుళం వైపు నుంచి విశాఖ నగరంలోకి వచ్చే బస్సులు మాత్రం సంగివలస కూడలి వద్ద ఆపకుండా వెళ్లిపోతున్నారు. ముఖ్యంగా 111, 411 నంబరు సిటీ బస్సులు ఆపకపోవడంతో విశాఖ వైపు నిత్యం వెళ్లే రోగులు, ఉద్యోగులు, కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. వీటిని ఆపడం ద్వారా వాహనాల వేగం తగ్గి ప్రమాదాలు కూడా తగ్గుతాయంటున్నారు. కనీసం ఈ కూడలిలో వేగ నియంత్రణ లేకపోవడం కూడా తరచూ ప్రమాదాలకు కారణమవుతోందని అంటున్నారు. ఈ కూడలిలో నిత్యం ట్రాఫిక్ పోలీసులు ఉన్నా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రమాదాల నివారణకు కాలినడక వంతెన నిర్మాణం, తగరపువలస ఫ్లై ఓవర్ నుంచి వలందపేట వరకు ఇష్టం వచ్చినట్టు రహదారి దాటకుండా డివైడర్‌పై దగ్గరగా రెయిలింగ్ ఏర్పాటు చేయడం, ఈ కూడలి వద్ద వాహనాల వేగానికి కళ్లెం వేయడం వంటివి చేయాలని పలువురు కోరుతున్నారు.


జాతీయ రహదారిపై సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయం ముందు నిలిపిన వాహనం


సంగివలస వద్ద జాతీయ రహదారి


ఆలయాల ముందు సర్వీస్ రోడ్డులో కుడివైపు నిలిపిన బస్సు


సర్వీస్‌రోడ్డులో ఎడమవైపు నిలిపిన ఆటో

గెడ్డలోకి జారిపోతున్న మట్టి


సాగర్‌నగర్ గెడ్డలోకి జారుతున్న మట్టి

కొమ్మాది : బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ గెడ్డలో రోజురోజుకూ మట్టి పెల్లలుగా పడిపోతోంది. ఇటీవల ఈ గెడ్డలో వ్యర్థాలు తొలగించి, మట్టిని తీసేశారు. అయితే ఈ గెడ్డకు ఇరువైపులా రక్షణ గోడ లేకపోవడంతోపాటు, గెడ్డ సమీపంలో భారీ వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల మట్టి కుంగిపోయి గెడ్డలో పడిపోతోంది. దీనివల్ల గెడ్డలో నీరు నిలిచిపోతోంది. సంబంధిత అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపించాలని స్థానికులు కోరుతున్నారు.

యువకుడిని కాపాడిన ఎంవీపీ పోలీసులు

ఎంవీపీ కాలనీ : కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడేందుకు ప్రయత్నించిన ఓ యువకుడిని ఎంవీపీ పోలీసులు కాపాడారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమిలి మండలం ఉప్పాడకు చెందిన మామిడి సంతోష్(30) కుటుంబ కలహాల కారణంగా ఆదివారం అప్పుఘర్ సముద్ర తీరంలో ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దీనిపై కుటుంబ సభ్యుల సమాచారంతో అప్పుఘర్ తీరానికి చేరుకున్న పోలీసులు.. ఆయన ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. అనంతరం అతని భార్యకు సమాచారం అందించారు. దీంతో సంతోష్ భార్య పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు


కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

హోమియో మందుల పంపిణీ


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం : భీమిలిలోని కలిగొట్ల స్వ్రిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 102 మంది రోగులను వైద్యులు టీజే మోహన్, టి.జగన్నాథరావు పరీక్షించి అవసరమైన మందులు అందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు, కె.పద్మజ, కె.శ్రీనివాసరావు, కె.చంద్రశేఖర్, కె.అనురాధ, సభ్యులు లక్ష్మణరావు, శ్రీనివాసరావు, రాంబాబు, శంకర్, రాము, తాతాజీ పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఉత్సవాలు ప్రారంభం


పద్మనాభంలోని దుర్గాలమ్మ విగ్రహం

పద్మనాభం : పద్మనాభం గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న దుర్గాలమ్మ ఉత్సవాలు ఆదివారం రాత్రి దేవర సంబరంతో ప్రారంభమయ్యాయి. సోమవారం తొలేళ్ల ఉత్సవం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా అమ్మవారి ప్రతిమలను గ్రామంలో ఊరేగిస్తారు. మంగళవారం అనుపోత్సవంలో భాగంగా రథాలు ఊరేగిస్తారు. ఈ సందర్భంగా కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అలరించిన సినీ సంగీత విభావరి


సినీ సంగీత విభావరిలో పాల్గొన్న గాయనీ గాయకులు, అతిథులు

దాబాగార్డెన్స్ : అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన సినీ సంగీత విభావరి అలరించింది. విజయనగరానికి చెందిన మ్యూజిక్ స్క్వాడ్ సరిగమప ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొని మాట్లాడారు. ఎన్నో ప్రయాసలతో సినీ సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. వర్ధమాన గాయకులు పి. రాంబాబు, పూర్ణిమ, సీహెచ్‌వీ సత్యనారాయణ, శైలజా మీరజ్, భాగ్యలక్ష్మి, పుండరీకుమార్, రామరాజు, కందర్ప రాధ తదితరులు పలు తెలుగు చిత్రాల్లోని మధుర గీతాలు ఆలపించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. లక్ష్మీ స్వరూప వ్యాఖ్యాతగా వ్యవహరించగా కొణతాల రాజు, చెన్నా తిరుమలరావు, జేఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం


సదస్సులో మాట్లాడుతున్న భీమిలి సీఐ రమేష్

తగరపువలస : విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని భీమిలి సీఐ రమేష్ సూచించారు. జీవీఎంసీ రెండో వార్డు సంగివలస శశి విద్యాసంస్థల విద్యార్థులకు భీమిలి పోలీసులు ఆదివారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ డి.రమేష్, ఎస్ఐ గంటా హరీష్, సిబ్బంది మాట్లాడుతూ సైబర్ క్రైమ్ మోసాలు, ఎలా అప్రమత్తంగా వుండాలో వివరించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలైతే భవిష్యత్ అంధకారం అవుతుందని హెచ్చరించారు. నిత్య జీవితంలో సీసీ కెమెరాల వినియోగం వల్ల కలిగే లాభాలు, ట్రాఫిక్ నిబంధనలపై వివరించారు. రోజా పోలీసుల పనితీరును తెలియజేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. వివిధ నేరాలకు విధించే సెక్షన్లను తెలియజేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్, చట్టాలపై విద్యార్థుల సందేహాలు తీర్చారు. పౌరులంతా పోలీసుల పట్ల స్నేహభావంతో మెలిగి సమాజంలో ప్రశాంతత కోసం కలిసి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఉత్సవం రేపు



మధురవాడ : మధురవాడ, చంద్రంపాలెం పరిసర ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం జాతర గట్టు చంద్రంపాలెం దుర్గాలమ్మ వారాలు పండగ మంగళవారం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఏటా జ్యేష్ఠమాసంలో పౌర్ణమికి ముందు మంగళవారం వారాలు లేదా ఉత్సవాలు నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది మంగళవారం నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ రోజు అమ్మవారికి ఉదయం 6.30 గంటలకు నిత్యార్చన, 7.30 నుంచి పంచామృత, సుగంధ ద్రవ్యార్చనలు, కుంకుమ పూజలు, పుష్పార్చన అనంతరం విశేష అలంకరణ, పూజలు నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం 3 గంటల నుంచి సాముగరిడీలు, కేరళ వాయిద్యాలు, పులి వేషాలతో అమ్మవారిని ఊరేగిస్తామన్నారు. అనంతరం గుడికి చేరుకుని భక్తులు మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు. భక్తులు అంతా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని శ్రీ దుర్గాలమ్మ సంక్షేమ సేవా సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు కోరారు.

సంగీతానికి మంచి సాహిత్యం తోడవ్వాలి


పద్యకవి వెంకటేశ్వర్లు, యోగాచార్యులు వెంకటరమణను సత్కరిస్తున్న సంగీత శిక్షణాలయ వ్యవస్థాపకుడు సంతోష్‌కుమార్


కర్ణాటక సంగీతం వినిపిస్తున్న విద్యార్థులు

- యోగాచార్యుడు సీహెచ్ వెంకటరమణ

తగరపువలస : సంగీతానికి మంచి సాహిత్యం తోడవ్వాలని భీమిలి యోగ చైతన్య సంస్థ యోగాచార్యుడు సీహెచ్.వెంకటరమణ అన్నారు. చిట్టివలసకు చెందిన శ్రీగురురాజ సంగీత శిక్షణాలయం 10వ వార్షికోత్సవం స్థానిక బంతాటమైదానంలో విద్యార్థుల కీర్తనలతో వీనులవిందుగా సాగింది. ఈ సందర్భంగా యోగాచార్యుడు వెంకటరమణ మాట్లాడుతూ 64 కళలలో సంగీతం శక్తివంతమైనదన్నారు. శిశువులను, పశువులను, నాగులను కదిలించే శక్తి సంగీతానికి ఉందన్నారు. సంగీతం ద్వారా అనేక వ్యాధులను కూడా నయం చేయవచ్చన్నారు. ముఖ్యంగా కర్ణాటక సంగీతంతో శరీరంలోని అణువణువు పులకిస్తుందన్నారు. యోగా, సంగీతం, సాహిత్యం ఏదైనా దైవసాయిధ్యం పొందడమే లక్ష్యమన్నారు. నాగస్వరానికి నాగుపాము కూడా కట్టుబడి ఉంటుందన్నారు. పంచేంద్రియాలను బంధించే శక్తి ఒక్క సంగీతానికే ఉందన్నారు. ప్రముఖ పద్యకవి బులుసు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సరైన గురువు దొరికితే ఏ విద్య అయినా సార్థకమవుతుందన్నారు. పుట్టుకతోనే అంధత్వం ఆవహించినా సంతోష్‌కుమార్‌కు ఆకెళ్ల మల్లికార్జునశర్మ వంటి గురువు దొరకడంతో రెండేళ్లలోనే సంగీతంలో పాండిత్యం సంపాదించారన్నారు. ఆయన పేరు మీద నడుపుతున్న ఈ సంగీత శిక్షణాలయం పదేళ్లు విజయవంతంగా పూర్తి చేసుకుందన్నారు. సంగీతం, సాహిత్యం అర్థవంతంగా సాగితేనే చెవులకు ఇంపుగా ఉంటుందన్నారు. రామరాజు భూషణుడు, సంగమేశ్వరశాస్త్రి వంటి పూర్వీకులు సంగీత సాధనకు కొత్త మెలకువలు పరిచయం చేశారన్నారు. కర్ణాటక సంగీతం సాధన చేసేవారు సినిమా పాటలకు దూరంగా ఉండాలన్నారు. శిక్షణాలయం వ్యవస్థాపకుడు విజినిగిరి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఇద్దరితో ప్రారంభమైన శిక్షణాలయంలో ప్రస్తుతం 70 మంది ఉన్నారన్నారు. ఆన్‌లైన్‌లో బెంగళూర్, హైదరాబాద్, చెన్నై నగరాలతోపాటు అమెరికా, ఆస్ట్రేలియా, నెదర్లాండ్, లండన్, సింగపూర్, మలేషియా వంటి దేశాలలో విద్యార్థులకు రోజూ శిక్షణ తరగతులు కొనసాగిస్తున్నట్టు తెలిపారు. ఉపాధి మార్గంగా కూడా సంగీతం దోహదపడుతుందన్నారు. ఈ వార్షికోత్సవాల్లో మందరపు చంద్రశేఖర్, భీమ్‌సేన్‌రావు, హేమారావు, మధుసూదనరావు, వీర్రాజు, రాజశేఖర్, పాల్గొన్నారు.

ముగిసిన సంగీత కచేరీలు

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన సంగీత కచేరీలు ఆదివారం ముగిశాయి. ఇందులో భాగంగా ఆదివారం ముంబయికి చెందిన అదితి సుదర్శన్ వేణు గానంతో సంగీత ప్రియులను ఓలలాడించారు. అనంతరం కుమారి కోట, గాయత్రీ వరేణ్యలు గాత్ర కచేరీతో అలరించారు. అకాడమీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పేరాల బాలమురళి, తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


ఆనందపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధానందుని శిష్యులు

తగరపువలస : ఆనందపురం మండల కేంద్రంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రబోధానందుడు రచించిన గ్రంథాల్లోని అంశాలను కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు వివరించారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలిపారు. ప్రచార కార్యక్రమంలో సభ్యులు వి.సురేష్, ఎస్.శ్రీనివాస్, బి.పైడన్న, కె.సంతోష్‌లక్ష్మి, బంగారుతల్లి, కె.లక్ష్మి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

385 రోజుల అఖండ హరినామ సంకీర్తన పూర్తి


దాకమర్రి చేరుకున్న భజన మండలి సభ్యులు

తగరపువలస : భీమిలి మండలం దాకమర్రి శ్రీలక్ష్మి వల్లభ నారాయణస్వామి ఆలయంలో గత ఏడాది చేపట్టిన 385 రోజుల హరినామ సంకీర్తన ఇటీవల పూర్తయింది. దీంతో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీను సిద్ధాంతి ఆధ్వర్యంలో భజన బృందంలోని 120 మంది సభ్యులు మూడు బస్సుల్లో అయోధ్య, వారణాశి, పూరీ క్షేత్రాల సందర్శనకు వెళ్లారు. ఆ యాత్రలను ముగించుకుని ఆదివారం దాకమర్రి ఆలయానికి చేరుకున్నారు. వీరికి గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు.

ఎమ్మెల్యే గంటాను కలిసిన మాజీ సైనికులు

తగరపువలస: భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును శ్రీచైతన్య మాజీ సైనికుల సంఘం సభ్యులు ఆదివారం కలిశారు. తమ అసోసియేషన్ బిల్డింగ్ కోసం 200 చదరపు గజాల స్థలం ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. 300 మందికి పైగా మాజీ సైనికులు ఉన్న తమ సంఘం 2008లో రిజిస్టర్ అయిందని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

నృసింహస్వామికి వైభవంగా ఆర్జిత సేవలు


తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

చలివేంద్రం నిర్వాహకులకు అభినందనలు


చలివేంద్రం నిర్వాహకులను అభినందిస్తున్న దుర్గాలమ్మ ఆలయ కమిటీ పెద్దలు

మధురవాడ : మండు వేసవిలో 3 నెలలపాటు చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయం ఆవరణలో మజ్జిగ చలివేంద్రం నిర్వహించిన పీఎం పాలెం పద్మశాలీ ఆత్మీయ సేవా సంఘం ప్రతినిధులను ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ చలివేంద్రం ముగింపు సందర్భంగా ఆఖరి రోజు కార్యక్రమాన్ని పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీవీ శివరామకృష్ణ, ఆలయ ధర్మకర్త పిల్లా చంద్రశేఖర్, అధ్యక్షుడు పిల్లా సూరిబాబుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో శివరామకృష్ణ, పీఎం పాలెం సేవా సంఘం అధ్యక్షుడు కె.నాగేశ్వరరావుతోపాటు ఇతర ప్రతినిధులకు దుస్సాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సెక్రటరీ నాగోతి తాతారావు, కోశాధికారి పిల్లా శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పిల్లా వెంకటరమణ, పోతిన పైడిరాజు, దుర్గాశి సోంబాబు, పోతిన రాంబాబు, ఆలయ అర్చకులు పట్నాల హరిచరణ్, తదితరులు పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం రుద్రాభిషేకం, హోమాలు


పాత లోకల్ ఆఫీస్ వీధిలో రుద్రాభిషేకం నిర్వహిస్తున్న అర్చక సంఘం ప్రతినిధులు

తగరపువలస : శ్రీ జగద్గురు ఆదిశంకరాచార్య బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం నాలుగో వార్షికోత్సవం సందర్భంగా లోక కల్యాణార్థం ఆదివారం రుద్రాభిషేకం, రుద్రహోమం, గాయిత్రి హోమం నిర్వహించారు. స్థానిక పాత లోకల్ ఆఫీసు వీధిలోని కటకం రామారావు ఖాళీ స్థలంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు నిర్వహించారు. గౌరవ సలహాదారులు మధిర రమణ, మేకా శంకరశర్మ, దార్లపూడి కైలాష్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రామాయణం బుచ్చి కామేశ్వరశర్మ, కోశాధికారి పెంట వెంకటరమణ శర్మ, సభ్యులు బొల్లాప్రగడ రమణమూర్తి, నేరెళ్ల విశ్వేశ్వరశర్మ, ముట్నూరు రాజేష్ శర్మ, భోగాపురపు కార్తికేయ శ్రీనివాసశర్మ, బూరాడ కామేశ్వరరావు, దార్లపూడి కామేశ్వర శర్మ, నేతేటి శశిభూషణ శర్మ, నాగ శర్మ, ఏడిద కార్తీక్, చిట్టిళ్ల రాము, జయంతి మాణిక్యాలరావు, రామాయణం మారుతీ ప్రసాద్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

● తీరం.. జనసంద్రం


రుషికొండ బీచ్‌లో పర్యాటకులు

కొమ్మాది: పర్యాటక ప్రాంతాలన్నీ సందర్శకులతో ఆదివారం కిటకిటలాడాయి. ఉదయం నుంచి భగభగమండే భానుడి ప్రతాపంతో అల్లాడిపోయిన ప్రజలు ఉపశమనం కోసం తీరంలో సేదతీరారు. సాగర్‌నగర్, రుషికొండ, తొట్లకొండ, భీమిలి బీచ్‌లలో స్నానాలు చేస్తూ, ఎండ నుంచి ఉపశమనం పొందారు. తిమ్మాపురంలో గల రామానాయుడు ఫిల్మ్ స్టూడియో, బావికొండ, మంగమారిపేట, తొట్లకొండపైకి పర్యాటకులు ఎక్కువగా వెళ్లారు. వరుసగా రెండు రోజులు సెలువులు కావడంతో కూడా పర్యాటకులు అధికంగా తరలివచ్చారు.